# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# శతచిత్ర సుందరా...

పేకేటి

(వెండితెర 1962 జులై సంచికనుంచి పునర్ముద్రితం)




ఒక పుష్కరం క్రితం సంగతి !

స్థలం : శోభనాచల స్టూడియో.

సందర్భం : “మనదేశం” అనే తెలుగు చిత్రం షూటింగ్.

సమయం : ఉదయం 11 గంటలు.

సన్నివేశం : సబిన్ స్పెక్టర్ లాఠీ ఛార్జిచెయ్యటం.

స్వగతం : “అయ్యబాబోయ్! సబినస్పెక్టరు వేషం వేసిన కుర్రాడు కొంపతీసి నిజంగా పోలీసు ఉద్యోగి కాదు కదా? చచ్చేలాగ బాది పారేస్తున్నాడే!”

కొన్ని మాసాల తర్వాత!

స్థలం : శోభనాచల స్టూడియో.

సందర్భం : "పల్లెటూరి పిల్ల" షూటింగ్.

సమయం : సాయంత్రం 4 గంటలు.

సన్నివేశం : ప్రేయసీ ప్రియుల డ్యూయెట్ పాట.

స్వగతం : "భలే అందంగా వున్నాడు కుర్రాడు. నిజంగా తెలుగు తెరకు నిండైన విగ్రహం."

ఒక ఏడాది గడిచింది.

స్థలం : వాహినీ స్టూడియో.

సందర్భం : "పాతాళ భైరవి" షూటింగ్.

సమయం : రాత్రి 8 గంటలు.

సన్నివేశం : తోటరాముడు ఉద్యానవనంలో "ఎంత ఘాటు ప్రేమయో" అంటూ విరహవేదన పడుతూ వుంటాడు.

స్వగతం : "ఇంత అందంగా వున్నాడు హీరో. పైగా బాగా చదువుకున్న సంస్కారం గల పెద్దమనిషి అని అంటున్నారు. పరిచయం అయితే బాగుండునే !"

ఈ విధంగా సీనిక్ ఆర్డర్ లో, అప్లికేషన్ ఫారం పద్దతుల్లో, ప్రశ్నలు–జవాబులు నమూనాలో వ్రాసుకుంటూ పోతే కొన్ని వందల పేజీలు అయిపోతుంది. ఏ రోజున ఏ శుభసమయంలో శ్రీ యన్.టి.రామారావుతో నాకు పరిచయం అయిందో, మొట్టమొదటిసారి మాట్లాడుకున్నామో నేను చెప్పలేను. ఎందుకంటే ఆయనను చూసిన కొన్ని నెలల తర్వాత, ఆయన వంక తిరిగి "నమస్తే!" అని చక్కాబోయాను. అట్లా అన్న కొన్ని నెలల తర్వాత ఆయనను పలకరించి ఏవో విషయాలు జనరల్ గా మాట్లాడుకున్నాం. అట్లా పిచ్చాపాటీ మాట్లాడుకున్న కొన్ని మాసాల అనంతరం బాగా పరిచితులమయ్యాం. ఇది జరిగిన అనేక నెలల తర్వాత ఆత్మీయులమయ్యాం. చాలా గమ్మత్తుగా వుంటుంది మా స్నేహం. నాలో నాకే నవ్వు వస్తుంది.

"ఏమండీ !" అనే రోజుల తర్వాత "ఏం బ్రదర్ !" గా మారిన సంబోధన. "ఏరా ! రామూ !" అనేటంత ఆత్మీయతగా మారింది. మళ్ళీ "ఉంటా బ్రదర్ !" అనే స్నేహలత, "అన్నయ్యా ! ఏమిటి విషయాలు ?" అనే సన్నిహితత్వం క్రింద రూపొందింది. వయస్సులో నాకంటే చిన్నవాడే కావచ్చు యన్.టి.ఆర్. కాని యీరోజున "అన్నా!" అనే నేను పిలుస్తున్నాను. ఎందుకో తెలీదు. నాకే గనక నిజంగా అన్నగారు వుంటే ఏవిధమైన భావాలు, గౌరవం, భయం వుంటాయో అవన్నీ నాకు యన్. టి. ఆర్. పట్ల గల్గడం నాకే ఆశ్చర్యకరం.

అత్యంత సన్నిహితులమై, కలిసి భోజనం చేసి, ఒక్క చోటనే పండుకుని కులాసాకబుర్లు చెప్పుకుంటూ అతి ఆత్మీయతతో వున్నది "వద్దంటే డబ్బు" చిత్రం షూటింగ్ రోజుల్లో. అప్పటినుంచి సహనటుణ్ణిగా, మిత్రుడిగా, ఒక సామాన్య వర్కర్ గా ఆయన స్వంత చిత్రాల్లో బయట చిత్రాల్లో నటించినప్పుడు యన్.టి.ఆర్. మనస్తత్వం, మైత్రి, ఆత్మీయత, సలహా, యిత్యాది వివిధభావాలను అనేక కోణాల నుంచి చూచాను. అతి సన్నిహితుడనై ఆయనను అర్ధం చేసుకున్నాను. అందుకే యన్.టి.ఆర్. వంద చిత్రాలలో నటించిన సందర్భంలో వ్యాసం వ్రాయమని సంపాదకులడిగితే సాహసించాను.

"శతపత్ర సుందరీ" అంటూ టంగుటూరి సూర్యకుమారి కమ్మని కంఠంతో పాడింది. ఆబాలగోపాలం ముగ్దులయ్యారు ఆ గీతానికి. ఈనాడు "శతచిత్రసుందరా!" అంటూ అతి ఆత్మీయతతో అన్నగార్ని సంబోధించటంలో అనిర్వచనీయానందం పొందుతున్నాను.

షుమారు యిరవై చిత్రాల్లో ఆయనతో బాటు నటించే అదృష్టం కలిగింది నాకు. సెట్ మీద సాటి నటీనటులతో ఆయన ఎంత కలుపుగోలుతనంగా వుంటారో, భావప్రదర్శనలో గాని, సంభాషణల ఉచ్చారణలోగాని ఎంత చక్కని సలహానిస్తూ, సహకరిస్తూ, సమిష్టి కృషికి దోహదమిస్తారో ఆయనతో పనిచేసే నటవర్గానికందరికీ బాగా తెలుసు. యన్. టి. ఆర్. డిక్షనరీలో "సోమరితనం" అనే మాట లేదు. కాస్త డల్ గా వుంటే చాలు "ఏం శివా ? ఏమట్లా వున్నావ్ ? కమాన్ ! గెట్ ఇన్ టు మూడ్సు!' అంటూ ఉషార్ చేస్తాడాయన.

శిక్షణ, డిసిప్లిన్ అనేది యన్.ఏ.టి. ప్రాంగణంలో నేర్చుకోవాలి. రాయలసీమ క్షామ నివారణ నిధికై ఆయన టూర్ బయల్దేరేటప్పుడు "చేరేవాళ్ళు రావచ్చు" అని ప్రకటించారాయన. దేశసేవ చేసే అవకాశం యీవిధంగా లభిస్తోంది కదా అని నేను వెళ్ళి "రామా ! నేనూ వస్తాను" అన్నాను. ఇరవై రెండు రోజులు ఆంధ్రదేశమంతటా పర్యటించిన ఆ సందర్భంలో ఆ ప్రోగ్రామ్స్, ఆ శిక్షణ, ఆ నిజాయితీ, రాత్రింపగళ్ళు నిద్రాహారాలకు లెక్క చేయకుండా తిరిగిన ఆ దీక్ష ఇదంతా నా జీవితంలో మరపురాని ఘట్టం. నాలుగు సంవత్సరాల సైనిక శిక్షణ, ఆరు సంవత్సరాల యన్.సి.సి. క్రమశిక్షణా ఆ మూడు వారాల్లోనూ అలవడిందంటే అతిశయోక్తి లేదు. నిజంగా పట్టుదల, దీక్ష అనేది; అకుంఠిత మానవశక్తి మీద నమ్మకం అనేవి నాలో కలగడానికి కారణం ఆ ట్రిప్. నేను అన్నగారికి, శ్రీ త్రివిక్రమరావుగారికి ఎంతైనా ఋణపడి వున్నాను. అంతే కాదు. మంచి ఉంటే గ్రహించి, ప్రోత్సహించటంలోను, చెడు ఉంటే క్షమించి మృదువుగా మందలించి సలహా ఇవ్వడం లోనూ అన్నగారికి ఆయనే సాటి.

"జీవితంలో తెలివితేటలు, చొరవ, నటనానుభవం, ఆశయాలు యిన్ని వున్నా కూడా శీలం, నిజాయితీ ఎంతో అవసరమనీ, అవి కళాకారుణ్ణి తీర్చిదిద్ది, ఒక మహనీయమైన అంతస్థుకు తీసుకువెళ్ళడమే గాక, పవిత్రత అనే పైమెరుగు దిద్ది దైవంశకు సన్నిహితుణ్ణిగా తీసుకు వెళతాయి" అని చక్కగా ఉద్బోధిస్తారు అన్నగారు.

ఈ రోజుక్కూడా ఆయన తెల్లవారు ఝామున నాలుగు గంటలకు లేచి ఆసనాలు వేస్తారు, వ్యాయామం చేస్తారు. ఆ తర్వాత స్నానాదులు, దైవపూజ యివన్నీ చేసుకుని మేకప్ కు అందరికన్నా ముందు తయారౌతారు. ఇంక సెట్ లోకి వచ్చిన తర్వాత ఒక్క నిముషం యే విధమైన యితర వ్యాసంగమూ ఆయనకక్కరలేదు. తను నటించే పాత్ర, దానికి సంబంధించిన వాతావరణం, అంతే. పని విషయంలో ఎంత శ్రద్ధ, పవిత్రత, కేంద్రీకరణో చెప్పలేను. ఆయన రాముడు, కృష్ణుడు, శంకరుడు యిత్యాది పాత్రలకు మేకప్ వేసుకున్న రోజున ఎంతో శుచిగా, నియమంగా వుంటారు. ఆహారనియమాల్లోగాని, వాతావరణ, ప్రసంగ, చర్చాదుల్లోగాని ఎంతో పవిత్రత, భక్తి తొణికిసలాడుతూ వుంటుంది. అందుకే అటువంటి పాత్రలు ఎవరైనా ధరించి పరుషవాక్యాలు ఉచ్చరించినా, లేక సిగరెట్ వగైరాలు ముట్టించినా పాపం అన్నగారు బాధ పడ్తారు. సాధ్యమైనంత వరకు తన సమక్షంలో అటువంటివి జరగటం తనకు యిష్టం వుండదని మృదువుగా, నిష్కర్షగా చెప్తారు.

అన్నగారు ఎంత దైవభక్తులో చెప్పడానికి ఒక్క ఉదాహరణ చాలు. "జగదేకవీరుని కథ" శతదినోత్సవ సందర్భంలో మేము ఆదోని వెళ్ళినప్పుడు, అక్కడకు షుమారు నలభైమైళ్ళ దూరంలో మంత్రాలయ అనే క్షేత్రం వున్నదని, శ్రీ వీరరాఘవేంద్ర స్వాముల వారు సజీవ సమాధి చెందారని ఎవరో పెద్దలు చెప్పారు. ఆ రోజు సాయంత్రం అక్కడకు వెళ్ళి ఆ క్షేత్ర దర్శనం చేసుకుని వద్దామని అన్నగారు అన్నారు. అనడమేమిటి  ఆయన కార్యదీక్ష, సంకల్పసిద్ధి అల్లాంటివి. వెంటనే బయల్దేరి వెళ్ళి, అక్కడ తీర్థ ప్రసాదాలు స్వీకరించి రాత్రికల్లా తిరిగి వచ్చేశాము.

అన్నగారు ధరించిన పాత్రలను గురించి, వారి నటనా ప్రతిభను గురించి వ్రాయాలంటే అది ప్రత్యేకంగా పెద్ద వ్యాసం అవుతుంది. విభిన్న మనస్తత్వంగల వివిధ రకాల పాత్రలు ఆయన ధరించి ఎంత అద్భుతంగా నటించారో అందరికి తెలిసిన విషయమే. పాతాళభైరవి తోటరాముడికీ, పాండురంగ మహాత్యంలో పుండరీకునికి, దేవాంతకుడు సుందర్ కు, మాయా బజార్ లో శ్రీకృష్ణునికి, తోడు దొంగల్లో

వేషానికీ ఏమైనా పోలికలున్నాయా "కాలేజీ స్టూడెంటుగా, మహాభక్తునిగా, హాస్యపాత్రలో పిచ్చి పుల్లయ్యగా, ఒకటేమిటి ఏ పాత్రనైనా సరే అతి సమర్ధతతో నిర్వహించగలరు యన్.టి.ఆర్.

యన్.టి.ఆర్. తో కొంచెం సేపు కూర్చుని మాట్లాడితే క్రొత్త వాళ్లకు యీయన కొంచెం రిజర్వుడ్ వ్యక్తి అనే అభిప్రాయం కలుగుతుంది. కాని ఆయనలో ఎంత హాస్యధోరణి, ఎంత వాక్చాతుర్యం, ఎంత సంభాషణా చమత్కృతి వుందో కొంచెం సేపు మాట్లాడితేనే చాలు అర్ధమవుతుంది. ఎదుటి మనిషి వాదం తనకు నచ్చకపోతే ఆ సంభాషణ తప్పిస్తారే గాని, ఎంత మాత్రం అన్యుల మనసు నొప్పించే విధంగా మాట్లాడటం ఆయనకు రుచించదు.

భోజనం విషయంలో అన్నగారివద్ద వరవడి దిద్దుకున్న ప్రతి వాళ్ళూ ఆరోగ్యవంతులయి తీరుతారు. మిరపకాయ బజ్జీలు అన్నయ్యకెంత యిష్టమో చెప్పలేను. ఉపన్యాసవేదిక మీద అంత గంభీరంగా, ఆవేశంతో, ప్రతివాక్యం హృదయపూర్వకంగా, మేఘగర్జన లాగ మాట్లాడగలగడానికి ఆయనలోని చదువు, సంస్కృతి, నిజాయితీ, నిష్కల్మష హృదయం, గంభీర కంఠమే గాక, నాలుగుప్లేట్ల మిరపకాయ బజ్జీలు తిన్న డైనమిక్ ఫోర్సు అని నేను హాస్యమాడితే ఆయన మందహాసంతో "కరెక్టు శివా !" అనేవారు.

"గులేబకావళికథ" షూటింగ్ జరిగే రోజుల్లో నాకాయన్ని చూస్తే జాలి వేసేది. తను హీరో. అందులోనూ గ్లామర్ హీరో. సెట్స్ ప్లాన్ వేయించటం, సూపర్ వైజ్ చెయ్యటం, స్వయంగా దగ్గర వుండి అన్ని పాత్రల మేకప్, దుస్తులు వగైరా వేయించటం, డైలాగ్స్ నేర్పటం, కెమేరా ఫిక్స్ చేయటం, షాట్ తీయటం, మ్యూజిక్ కంపోజింగ్, పాటలు వ్రాయించటం, ఎడిటింగ్ ఒకటేమిటి అన్ని శాఖల్లో, అన్ని పనులూ ఆయన పర్యవేక్షణ చేసే వారు. చిత్రపరిశ్రమలో ఆయనకు తెలియని విషయం గాని, శాఖగాని లేదు. ఆయన చక్కని ఆర్టిస్టు, ఆర్టు డైరెక్టర్. అయినా ప్రతిశాఖకు టెక్నీషియన్ ఉండేవాడు. ఆ సాంకేతిజ్ఞుని అజమాయిషీలో ఆ శాఖ నడపబడవలసిందే. అక్కడే క్రమశిక్షణ అంటే ఎంత గొప్పదో నాకు గోచరించేది.

ఎంత నిర్మలమైన పసి హృదయమో యన్.టి.ఆర్. ది అనిపిస్తుంది నాకు. ఒకసారి చిన్నడైరీ షాట్సు వ్రాసుకునేందుకు పాకెట్ జేబులో యిమిడేందుకు సరిపోయేలాంటిది అన్న గారికి బహూకరించాను. ఆయన యీ సంగతి వాహినీ, విజయాల్లో కొన్ని వందలమందితో చెప్పి ఆ డైరీ చూపించారు. నేకనబడ్డప్పుడల్లా "శివా! డైరీ భలేగా ఉపయోగపడుతోంది" అనేవారు. అంత సింపిల్ మాన్ ఆయన.

ఓసారి సెట్ మీద నన్ను చాలా యిరుకులో పడేశారు అన్నయ్య. "పాండురంగ మహత్యం" షూటింగ్ జరుగుతోంది. ఆయనను ఒక సన్నివేశంలో వేశ్యాగృహంలో నేను కుర్చీతో వీపు మీద గట్టిగా కొట్టాలి. "అన్నా ! దెబ్బ తగుల్తుంది. నేను కొట్టలేను" అన్నాను. "శివా ! ఇక్కడ నువ్వు నటుణ్ణి అని మరిచిపోతున్నావు. నువ్వు కొట్టేది పుండరీకుణ్ణిగాని, రామారావును కాదు. కమాన్ గెట్ ఇన్ టు మూడ్స్" అని ఉరిమారు. నేను కిక్కురుమనలేదు. లాగి కుర్చీపెట్టి కొడ్తే వీపు చీరుకుపోయి రక్తం వచ్చింది. కుర్చీ తునాతునకలై పోయింది, నాకు కళ్లనీళ్ళు వచ్చి ఓ మూలగాపోయి బిక్క మొహంతో కూర్చున్నాను. షాట్ కట్ అవగానే ఆయన వీపుకు క్రీమ్, పవుడరు వగైరాలు రాశేరు. వీపంతా తట్టు తేలిపోయింది. "శివా!" అన్నాడు అన్నయ్య. నేను పలకలేదు. ఆయన లేచి నా వద్దకు వచ్చి ఆప్యాయతో నన్ను దగ్గరకు తీసుకుని "శివా ! ఇదంతా ఒక ఆట. మనం నటిస్తున్నాము పాత్రల్లో. నువ్వు పర్సనల్ గా యిట్లా ఫీలవకూడదు" అన్నారు. రామారావులో వుండే గొప్పతనం అదే.

"సీతారామ కళ్యాణం" ప్రివ్యూ యిచ్చారు విజయా గార్డెన్స్ లో. ఆహ్వానాలు పంపటం నుంచి, ఆహ్వానితులను అక్కడ రిసీవ్ చేసుకునే ప్రతి విషయంలోనూ ఆయన ఆధ్వర్యంలోనే ఏర్పాట్లు నడిచాయి. ఆయన శాసనం మేరకు, ఆజ్ఞాబద్ధులమై ప్రతి ఒక్కరం ప్రవర్తించాము. ఆ సందర్భంలో అనేకమంది, అనేక విధాల అస్మదాదులను ఆడిపోసుకున్నారు. కాని శ్రీ రామారావు "వాళ్ళు ప్రతిపనీ నా ఉత్తర్వు మీదనే చేశారు. ఏమైనా లోటుపాట్లు వుంటే బాధ్యులం మేము గానీ, వాళ్ళు కాదు" అన్నారు. నిజంగా యీ పరిశ్రమలో ఆ విధంగా మంచి చెడ్డల్ని తమ మీద

వేసుకుని, అనుచరుల్నీ, స్నేహితుల్నీ ఛత్రచ్ఛాయలో నిలబెట్టే వాళ్ళెంతమంది వున్నారు? అదే యన్.టి.ఆర్. వ్యక్తిత్వం. అదే నందమూరి సోదరుల ప్రత్యేకతాను.

నేను ఆ కుటుంబంలో ఒక మెంబర్ లాగ, యన్.టి.ఆర్. తల్లిదండ్రుల ప్రేమాభిమానాలు పొంది, సోదరులిద్దరి అభిమాన గౌరవాలు పంచుకుని, ఎంతో సన్నిహితంగా మెలిగాను. కాని గమ్మత్తేమిటంటే ఆయన నిండుకుండ. తొణకని హృదయం. ఆప్యాయత, ఆపేక్ష హృదయంలోనే పదిల పర్చుకుంటారు. ఆగ్రహం, అసహ్యత, తనలోనే జీర్ణించుకుంటారు. పైకి పల్లెత్తు మాట అనరు. ఎంతో ఎమోషనల్ మెంటాలిటీ. ఏదైనా ఒక విషయాన్ని గురించి మాట్లాడుతూ వుంటే ఆయన ఆవేశం, ఉద్విగ్నత మనకు గోచరిస్తుంది. అటువంటి వ్యక్తి సంతోషంతో నెత్తిమీద పెట్టుకోవటం గానీ, కోపంతో తూలనాడటం గానీ ఎందుకు చెయ్యరు అని ఆశ్చర్యంతో ప్రశ్నించుకుంటాను నేను. అదే నిగ్రహం, అదే విచక్షణా జ్ఞానం, అదే యుక్తాయుక్త పరిజ్ఞత అని గ్రహించుకుని ఆయనను మనసారా అభినందిస్తాను.

అన్నగారికి రాజకీయాలంటే సరిపడదు. కాని సంపూర్ణమైన రాజకీయ పరిజ్ఞానము కలిగిన వ్యక్తి. పార్టీలు, మతాలు, వగైరా అసలే గిట్టదాయనకు. ఆయనకెంతసేపూ కావలసింది "నిత్యం వర్కు. షూటింగులు. పవిత్ర వాతావరణం. సినిమా పరిశ్రమకు సంబంధించిన విషయాలు, సమస్యలు." అంతే. ఆయన సామీప్యంలో ఏ వ్యక్తిని గురించి గానీ, ఏ సంస్థను గురించి గానీ, ఏచిత్రాన్ని గురించి గానీ ఏ మాత్రం పరుషంగా, లేదా విమర్శనతో ఎవ్వరు మాట్లాడినా సహించరు. అసలు అట్లా మాట్లాడే ఆవకాశం యివ్వరు. అథవా, అవతల వ్యక్తి ఏదో గొడవ ప్రారంభించినా వెంటనే దాన్ని మధ్యలోకి త్రుంచి ఆ సంభాషణనంతటితో అంతం చేస్తారు. స్నేహితుడు, సరస వచనాధరీణుడు, వెండితెర అందగాడు, పరిశ్రమలో ప్రతి ఒక్కరి చేత గౌరవింపబడే మహనీయుడు, శతచిత్ర సుందరుడూ అయిన యన్.టి.రామారావును. ఆయన నూఅవ చిత్రం "గుండమ్మ కథ" లో చూచి, లైట్ రోల్ కు ఆయన ఎంత శోభచేకూర్చేరో, ఎంత అద్భుతంగా నటించారో తెల్పి అభినందించాలని అనుకున్నాను. తీరుబడిలేక నేను ఆయన్ను వారం రోజులు చూడలేదు. మిత్రులవద్ద అన్నాను. "అన్నగార్ని అభినందించాలి !" అని. కాని నేను అన్నగారిని చూడ్డానికి వెళ్ళింది – వారిని కలుసుకున్నది దైవ విధివల్ల మరొక రీత్యా అయిపోయింది. శతచిత్ర సుందరుణ్ణి – నూరవ చిత్రంలో అద్భుతంగా నటించినందుకు ఆనందంతో అభినందించే సన్నివేశాన్ని దైవం కలిగించలేదు నాకు. పుత్రశోకంతో కుమిలిపోతూ, ఆకస్మికంగా సంభవించిన ఆ దుర్ఘటనకు తల్లడిల్లుతూ శోకమూర్తియై కూర్చున్న ఆయన్ని చూడవలసి వచ్చింది. కన్నీటితో, సానుభూతి వాక్యాలు పలుకుతూ, ధైర్యవచనాలు చెబుతూ అన్నగార్ని ఆశ్వాసించవలసి వచ్చింది. దీన్నే దైవలీల అంటారు. నూరవ చిత్రం పూర్తయిన సందర్భంలో పదిమంది ఆత్మీయులు, పరిశ్రమలోని శ్రేయోభిలాషులు, తన అభిమానులు, అందరూ ఒక్కచోట కూడి తనను అభినందిస్తూ సంతోషంగా, కేరింతలతో కాలం గడపవలసిన సన్నివేశానికి బదులుగా. వీరందరినీ మరొక రూపేణా ఒక్కచోట చేర్చి షోడశవర్షప్రాయుడైన కుమారుని మరణానికి శోకిస్తూ కుమిలే ఆ తండ్రిని ఓదార్చవలసిన ఘట్టంగా మార్చిన ఆ క్రూరదైవాన్ని నిందిస్తూ మనస్సులో అంతా బాధపడినవాళ్ళే. అయినా అన్నగార్ని గురించి యీసందర్భంలో వ్రాసేటప్పుడు ఒకే ఒక్క కోరికతో, ఆశతో యీ వ్యాసం ముగిస్తాను.

"శతచిత్ర సుందరా ! నువ్వు చలనచిత్ర పరిశ్రమకు వరప్రసాదివి. సహస్రచిత్ర సుందరా !" అని అస్మదాదులు చరిత్రలో సువర్ణ లేఖినితో వ్రాసేలాగ పరమేశ్వరుడు చెయ్యాలని కోరుతున్నాను. అదే మా ఆశ. అదే మా ఆకాంక్ష. అదే మా ప్రార్థన.

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS